జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి తదితరులు

తెలంగాణ సాంస్కృతిక చరిత్ర నిర్మాణంలో
పరిషత్తు కృషి

వికారాబాద్, జనవరి 17 : సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తితో తెలంగాణ సాంస్కృతిక చరిత్రను నిర్మించడంలో తెలంగాణ సారస్వత పరిషత్తు సాగిస్తున్న కృషి అందరి అభినందనలు అందుకుంటున్నదని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని అంబేద్కర్ భవనంలో జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం తదితర అనేక అంశాలపై ప్రచురిస్తున్న గ్రంథాల పరంపరలో రూపొందించడం జరిగిందన్నారు. 15 జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలు ఒక్కొక్కటి సుమారు 400 నుంచి 500 పేజీల వరకు పూర్తయ్యాయని, మరో ఐదు జిల్లాల చరిత్ర, సంస్కృతి గ్రంథాలు తుది దశలో ఉన్నాయని తెలిపారు. ఈ గ్రంథాలు పూర్తయితే ఇతర రాష్ట్రాల వారు అసూయ చెందుతారని ఆయన చెప్పారు.

తెలంగాణలో జన్మించడం పూర్వజన్మ సుకృతం

వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తుల తరుణ్ కుమార్ మాట్లాడుతూ.. రాయప్రోలు సుబ్బారావు గేయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో జన్మించడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించిన ఈ గ్రంథం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు, విద్యార్థులు, యువత, సాధారణ పాఠకులే కాకుండా ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, ఉద్యోగులు కూడా చదవాలని ఆయన సూచించారు.

పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ నిజాం పరిపాలన కాలంలో పెద్దలు నెలకొల్పిన సారస్వత పరిషత్తు తెలుగు భాషను నిలిపేందుకు అనేక కష్టనష్టాలు అనుభవించిందని, దాని ఫలితమే ఈనాడు తెలంగాణలో తెలుగు వికాసమని కొనియాడారు. గ్రంథం రూపకల్పనలో కన్వీనర్‌గా వ్యవహరించిన డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ తిరునగరి దేవి, మండల ప్రజాపరిషత్ అధికారి, కోర్ కమిటీ సభ్యుడు మలుగు సత్తయ్య, అనంత సాహితీ సమితి ప్రతినిధి రాఘవేంద్రాచారి, మలుగు అంజయ్య అవధాని, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ

ఎమ్మెల్సీ స్థానాలను మాదిగలకు కేటాయించాలి

పెద్దేముల్, జనవరి 17 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మాదిగలకు 2 ఎమ్మెల్సీలను కేటాయించాలని వికారాబాద్ జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మంబాపూర్‌లో మండల స్థాయి ఎమ్మార్పీస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ సమక్షంలో మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ త్వరలో జరుగబోతున్నదని, మాదిగలు సంఘటితం కావాల్సిన అవసరముందని, కలిసికట్టుగా మూకుమ్మడిగా ముందుకు సాగాలని నాయకులు తీర్మానం చేశారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు మంత్రివర్గంలో స్థానం, ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు స్థానాలను కేటాయించి సముచితస్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు మోహన్, దావిద్, హరిసూదన్, సాయికుమార్, భరత్, ఎల్లేశం, బాల్‌రాజ్, కవిరాజ్, గోపాల్, ప్రకాశం, సుందర్, బోనప్ప, రత్నం, జయప్ప, అనిల్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సమీక్షా సమావేశంలో రంగరెడ్డి కలెక్టర్ శశాంక

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జనవరి 17 : ఎల్‌బీనగర్ నేషనల్ హైవే-65లోని మహవీర్ హరిణి వనస్థలి పార్క్ వద్ద 15/0 నుంచి 40/0 వరకు జరగాల్సిన జాతీయ రహదారి మరమ్మతుల కోసం ఆరు లైన్ల సర్వీసు రోడ్డు విస్తరణ సమస్యను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎల్‌బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు రోడ్డు విస్తరణ కోసం సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణను వేగవంతం చేసేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా జాతీయ రహదారి రోడ్లు, బిల్డింగ్స్ ఈఈ ధర్మారెడ్డి, జిల్లా సర్వే లాండ్ ఏడీ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి, జనవరి 17 : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మోకిల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మోకిల సీఐ వీరబాబు కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన గంజన్ సుభాష్ మోహతే(23), గోవిందా ధారాసింగ్(20), శిల్పా గంజన్ మోహతే(21) గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు అంతర్గత సమాచారం అందింది. శంకర్‌పల్లి మండలం, మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లో బుధవారం ఉదయం 6 గంటలకు ఒక మహిళ, ఇద్దరు యువకులు సంచులతో ఓఆర్ఆర్ సమీపంలో సంచరిస్తున్నారు. పోలీసులు సంచులను తనిఖీ చేయగా.. అందులో నిషేధిత గంజాయి ఉండడంతో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 44 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు

23న పరిగిలో జాబ్ మేళా

- 6500 ఉద్యోగావకాశాలు కల్పన లక్ష్యం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 17 : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధి కల్పన శాఖ ద్వారా ఈ నెల 23న పరిగిలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పరిగిలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పరిగి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. జీఎంఆర్, హెటిరో, అపోలో వంటి 50 కంపెనీల్లో 6500 ఉద్యోగావకాశాలు కల్పించేలా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూపీఏఎస్‌సీ తరహాలో టీఎస్‌పీఎస్‌సీని బలోపేతం చేసి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని పేర్కొన్నారు. త్వరలో గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల నియామకాల నోటిఫికేషన్‌లు వెలువరించబోతున్నదని ఆయన తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో తాండూరులో జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉపాధి కల్పన శాఖ ప్రాంతీయ అధికారిణి భవాని మాట్లాడుతూ.. టెన్త్ నుంచి పీజీ వరకు, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివినవారందరూ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ వన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నగదును చూపుతున్న డీసీపీ వినీత్

పని చేస్తున్న ఇంటికే కన్నం..
ముఠా అరెస్ట్

96.3 తులాల బంగారం, 2.90లక్షల నగదు స్వాధీనం

కొండాపూర్, జనవరి 17 : పనిచేస్తున్న ఇంటికే కన్నం వేసి.. బంగారు నగలతో పాటు నగదును అపహరించిన ముఠాను కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ బృందం సంయుక్త ఆపరేషన్‌లో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ వినీత్ వివరాలను వెల్లడించారు. ఉస్మాన్‌నగర్ ముప్పా ఇంద్రప్రస్థ హోమ్స్ విల్లా 188లో నివాసం ఉండే ముల్కల సుజాత గతేడాది డిసెంబర్ 21న వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఢిల్లీకి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన పని మనిషి, ఒడిశాకు చెందిన ప్రభాకర్ మాలిక్(28), పథకం ప్రకారం తనతో పాటు మరో ముగ్గురు తపన్‌దాస్(32), సచ్ఛింద్ర దాస్ (48), రతికాంత దాస్(26)తో కలిసి ఇంట్లో దాచిన 75 తులాల బంగారు నగలతోపాటు రూ. 6.50లక్షల నగదు తీసుకొని ఉడాయించారు. ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించిన సుజాత పర్సనల్ అసిస్టెంట్ జనవరి 9న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జనవరి 15న ప్రభాకర్ మాలిక్‌తో పాటు మిగతా ముగ్గురిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి 96.3 తులాల బంగారు నగలు, 2.90 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన ముఠాను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, మియాపూర్ ఏసీపీ నరసింహారావు, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, కొల్లూరు ఎస్‌హెచ్‌వో రవీందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన వికారాబాద్ రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు
రూ.96 కోట్లతో 900 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం

ప్రారంభమైన నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు

వికారాబాద్, జనవరి 17 : వికారాబాద్‌లో ప్రధాన సమస్యగా రైల్వే బ్రిడ్జి మారింది. రైల్వే బ్రిడ్జి మూల మలుపు వద్ద పలుమార్లు ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. బ్రిడ్జిపై భారీ వాహనం నిలిచిపోతే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడేవి. వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే రైల్వే బ్రిడ్జి 900 మీటర్లు ఉంది. రోడ్డుకు ఇరువైపులా పుట్‌పాత్‌లతో కలిసి 36 ఫీట్ల రోడ్డును గతంలో నిర్మించారు. చాలా రోజులు కావడంతో బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి కొన్ని రోజుల క్రితం రూ.96 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు తయారుచేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పిల్లర్లకు యంత్రాల సహాయంతో గుంతలు తీస్తున్నారు. పాతబ్రిడ్జి పక్కనే నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 25 ఫీట్ల రోడ్డుతో పాటు బ్రిడ్జికి ఒక వైపు 6 ఫీట్లతో పుట్‌పాత్ ఏర్పాటు చేయనున్నారు. బ్రిడ్జి నిర్మాణం ఒకటిన్నర సంవత్సరంలోనే పూర్తి చేయాల్సి ఉంది. పనులు పూర్తయితే జిల్లా వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుందని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

నిథిమ్ డైరెక్టర్‌ను అడ్డుకున్న ఉద్యోగులు

గచ్చిబౌలి నిథిమ్‌లో డైరెక్టర్ చిన్నంరెడ్డి చాంబర్‌లో బైఠాయించి ఆందోళన చేస్తున్న నిథిమ్ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్

శేరిలింగంపల్లి, జనవరి 17 : గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్ (నిథిమ్) డైరెక్టర్ చిన్నంరెడ్డికి వ్యతిరేకంగా ఉద్యోగులు తమ ఆందోళనను ఉధృతం చేశారు. బుధవారం ఉదయం నిథిమ్ డైరెక్టర్ చిన్నంరెడ్డి కారును క్యాంపస్ గేటు వద్ద నిలిపివేశారు. లోనికి రాకుండా అడ్డుకున్న నిథిమ్ అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి డౌన్ డౌన్ చిన్నంరెడ్డి అంటూ నినాదాలిచ్చారు. దీంతో డైరెక్టర్ చిన్నంరెడ్డి కారు దిగి.. నడుచుకుంటూ తన చాంబర్‌లోకి వెళ్లారు. చిన్నంరెడ్డి చాంబర్‌లో బైఠాయించిన అధ్యాపకులు, ఉద్యోగులు.. గోబ్యాక్ చిన్నంరెడ్డి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. చిన్నంరెడ్డి వెంటనే విధుల నుంచి తప్పుకోవాలంటూ నినాదాలు చేస్తూ.. తమ ఆందోళనను ఉధృతం చేశారు. కొద్ది రోజులుగా నిథిమ్ డైరెక్టర్ చిన్నంరెడ్డికి వ్యతిరేకంగా టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఆందోళన చేస్తున్న విషయం విదితమే. చిన్నంరెడ్డి నిథిమ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ పలు అవకతవకలకు పాల్పడ్డారని, అయనను వెంటనే డైరెక్టర్ పదవి నుంచి తప్పించి, నిథిమ్‌లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

శివారుల్లో శవాలు

- ఆచూకీ తెలియక మిస్టరీగా మారుతున్న ఘటనలు
- ఎక్కడో హత్య చేసి.. శివారుల్లో పడేస్తున్నట్లు అనుమానాలు
- దర్యాప్తులో తడబడుతున్న పోలీసులు

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): ఎక్కడో హత్య చేసి.. నగర శివారుల్లో శవాలను పడవేస్తున్న ఘటనలే ఎక్కువగా ఉంటున్నాయి. శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో గుర్తు తెలియని ఆ శవాల మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు నానా ఇబ్బంది పడుతున్నారు. వారం, పది రోజులు గడుస్తున్నా.. ఒక్క క్లూ కూడా కనిపెట్టలేకపోయారు. నిందితులు పక్కా ప్లాన్‌తోనే శవాలను కాల్చేసి వెళ్తున్నారు. ఈ కేసులను పరిష్కరించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో అత్యాధునిక పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నిరంతరం పెట్రోలింగ్ చేయాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దుండగులు యథేచ్ఛగా శవాలను పడేసేందుకు శివారు ప్రాంతాలను అడ్డాగా మార్చుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఔటర్ రింగ్ రోడ్డు సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోకి వస్తుంది. సైబరాబాద్‌లో చాలా వరకు, రాచకొండలో కొన్ని ప్రాంతాలు ఔటర్ వరకు నివాస ప్రాంతాలు విస్తరించాయి. దీంతో నిందితులు నిర్జన ప్రదేశాలను ఎంచుకుంటున్నారు. పోలీసుల నిఘా ఉండని ప్రాంతాల కోసం వెతికి.. ముందుగా రెక్కీ నిర్వహించి.. ఆ తర్వాతనే ఆయా ప్రాంతాల్లో మృతదేహాలను పడేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్‌కు సంబంధించిన ఆధారాలు ఉంటే కేసుల చిక్కుముడి ఈజీగా విడే అవకాశం ఉన్నదని, నిందితులు ఏ ఒక్క ఆధారాన్ని కూడా వదలకపోవడంతో ఈ కేసుల మిస్టరీని ఛేదించడంలో పోలీసులు తడబడుతున్నారు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటనలు..

☞ జనవరి 16 : ఒక వ్యక్తిని హత్య చేసి, చేతులు, కాళ్లు కట్టేసి గోనె సంచిలో మృతదేహాన్ని చుట్టి ఔటర్ రింగు రోడ్డుపై మూటను కింద పడేసి వెళ్లారు. దీనిపై ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చేతులు, కాళ్లు కట్టేసి ఉన్నాయంటేనే.. ఎక్కడో హత్య చేసిన దుండగులు.. శవాన్ని ఇక్కడ పడేశారన్న విషయం స్పష్టమవుతున్నదని పోలీసులు చెబుతున్నారు.

☞ జనవరి 16 : బాలానగర్- గండిమైసమ్మ రోడ్డులోని మయూరి టైల్స్ కంపెనీ వద్ద రోడ్డు పక్కన గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం దుండిగల్ పోలీసులు గుర్తించారు. రోడ్డు దాటుతూ అతడు ప్రమాదానికి గురయ్యాడా..? తలకు బలమైన గాయాలు ఉండటంతో ఎవరైనా హత్యా చేశారా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతుండటంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

☞ జనవరి 9 : ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని మంగళ్‌పల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో ఒక మహిళ మృతదేహం బయటపడింది. ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఇది హత్యా..? ఆత్మహత్యా..? అనేది నిర్ధారణ కాలేదు.

బొలెరో వాహనం ఢీకొని..
ఇద్దరు యువకులు మృతి

హయత్‌నగర్, జనవరి 17 : బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపల్లి సంజీవ(19), నడికూడి మనోజ్(13) కలిసి హోండా యాక్టివాపై కుంట్లూరు నుంచి పసుమాముల గ్రామానికి వెళ్తున్నారు. పసుమాముల కమాన్ వద్దకు రాగానే అతివేగంగా ఎదురుగా దూసుకొచ్చిన బొలెరో వాహనం అదుపుతప్పి హోండా యాక్టివాను ఢీకొట్టింది. ఈ ఘటనలో యాక్టివాను నడుపుతున్న సంజీవ, వెనుకాల కూర్చున్న మనోజ్ ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ మనోజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని.. గాయాలపాలైన సంజీవను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులాయె.. అవస్థలు తప్పవాయె..!

దుమ్ము లేపుతున్న జాతీయ రహదారి

- రోడ్డు విస్తరణ కోసం తవ్వకాలు..
- కంకర తేలిన రోడ్లపై ప్రయాణం
- ప్రత్యామ్నాయం చూపని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

వనస్థలిపురం మహావీర్ హరిణ వనస్థలి నుంచి హయత్‌నగర్ వెళ్లే దారిలో దుమ్ము లేచి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఎల్బీనగర్, జనవరి 17 : జాతీయ రహదారిపై దుమ్ములేస్తున్నది. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణలో భాగంగా చేపడుతున్న పనుల నేపథ్యంలో జాతీయ రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారుతున్నది. ఓ వైపు రోడ్డు విస్తరణ కోసం చేస్తున్న తవ్వకాలతో రోడ్డుపై దుమ్ము లేస్తుండగా మరోవైపు రోడ్డు తవ్విన నేపథ్యంలో కంకరరాళ్లు తేలి వాహనాలు ప్రయాణించేందుకు తీవ్ర ఇక్కట్లు కలుగుతున్నాయి. రోడ్డు విస్తరణ చేస్తున్న సమయంలో రోడ్డు తవ్వకాలు చేస్తున్న ప్రాంతం పక్కన ప్రత్యామ్నాయంగా రోడ్డును వేసి ఆ దారిలో వాహనాలను మళ్లించాలి. అయితే ప్రస్తుతం జాతీయ రహదారిపై వనస్థలిపురం హరిణ వనస్థలి నుంచి హయత్‌నగర్ వరకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం రోడ్డు విస్తరణ కోసం తవ్వకాలు చేయగా కంకర రోడ్డుపైనే వాహనాల్లో ప్రయాణించడం కష్టంగా మారింది. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులకు ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయి. దుమ్ము లేచి ముందు వాహనాలు సైతం కూడా కనిపించని పరిస్థితిలోకి చేరుతుండటంతో దుమ్ము రోడ్డులో ప్రయాణం సంకటంగా మారుతున్నది. అధికారులు ఇప్పటికైనా స్పందించి సదరు అధికారులు రోడ్డు విస్తరణ పనులను చేపట్టడంతో పాటు వాహనదారులు వెళ్లేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపై దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం

జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టడం మంచి పరిణామం. అయితే వనస్థలిపురం హరిణ వనస్థలి నుంచి హయత్‌నగర్ వెళ్లే మార్గంలో రోడ్డుపై తవ్విన నేపథ్యంలో కంకర రోడ్డుపైనే ఉండటం, వాహనాలు వెళ్లే దారి మొత్తం దుమ్ము లేచి ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

– మెండు వెంకట్‌రెడ్డి, స్థానికుడు

డిజిటలైజేషన్ దిశగా భూములు.!

- అన్యాక్రాంతం కాకుండా చర్యలు
- హైదరాబాద్ ఆస్తుల రక్షణకు ఏర్పాట్లు
- వచ్చే నెలలో భూముల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి
- అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్న కలెక్టర్
- త్వరలో జిల్లా రెవెన్యూ, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాలు కాకుండా రక్షించడంపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టి సారించారు. జిల్లాలో ఉన్న భూముల విలువ కోట్లలో ఉంది. దీంతో చాలా మంది పలుకుబడి ఉన్నబడా బాబులు, సంపన్న వర్గాలకు చెందిన వారు తమ పలుకుబడితో జిల్లాలో ఉన్న వందల ఎకరాల భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతులకు చెందిన భూములతో పాటు ప్రభుత్వానికి చెందిన అనేక భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతున్నాయి. ఈ క్రమంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ భూములను కాపాడటం కోసం జిల్లాలో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టే దిశగా జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని రకాల భూములను డిజిటలైజేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. భూముల డిజిటలైజేషన్ పనులు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ.. ప్రస్తుతం సిబ్బంది మొత్తం ఆరు గ్యారెంటీలు, ఇతర పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. ఈ క్రమంలో వచ్చే నెలలో సిబ్బందిని పరిగణనలోకి తీసుకుని భూములను డిజిటలైజ్ చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. వచ్చే నెలలో మండలాలు, గ్రామాల వారీగా ఉన్న భూములను గుర్తిస్తామని, ఇందుకోసం స్థానిక తహసీల్దార్‌తో సర్వే నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఎన్ని భూములు ఉన్నాయి? ఏయే సర్వేలో ఉన్నాయి? ఓనర్లు పరిస్థితి ఏమిటీ వంటి సమగ్ర సమాచారాన్ని డిజిటలైజేషన్ చేస్తామన్నారు. అయితే డిజిటలైజేషషన్ కంటే ముందుగానే సంబంధిత రెవెన్యూ అధికారులతో పాటు తాసీల్దార్లతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను ప్రారంభించే ముందు తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకున్నాకే డిజిటలైజేషన్‌ను ప్రారంభిస్తామని జిలా కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో ప్రభుత్వానికి సంబంధించిన భూములు, అసైన్డ్ భూములు, ఎండోమెంట్ భూములతో పాటు పలు ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఇతరత్రా భూములను కాపాడటం కోసం డిజిటలైజేషన్ చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి నెలకొన్నదని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్‌వో, హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చెందిన ఆర్‌డీవో వంటి అధికారులతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అయితే ఫిబ్రవరి నెలాఖరుకు లేదా మార్చి నాటికి జిల్లాలో ఉన్న అన్ని రకాల భూములను డిజిటలైజ్ చేయడం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని (స్పెషల్ డ్రైవ్) నిర్వహించడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.